క్లుప్తంగా

బోరు మోటార్ ప్రారంభం



బోరు మోటార్‌ను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో శుక్రవారం బోర్ మోటర్‌ను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో కొద్దిరోజులుగా మంచినీటి సమస్య నెలకొనడంతో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్ గౌడ్ ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో కాంగ్రెస్ నాయకులు బోర్ మోటర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. కాలనీలో నీటి సమస్య తీరడంతో కాలనీవాసులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

అజీజ్‌నగర్ పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్



చెత్త, వ్యర్థాలను తొలగింపచేస్తున్న పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్

మొయినాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యమని అజీజ్‌నగర్ పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు దరిచేరవన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో రోడ్లకు ఇరువైపుల చెత్త, వ్యర్థాలను పంచాయతీ కార్మికులతో తొలగింప చేశారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బందితో నగరానికి వెళ్లే రహదారి, పోలీస్ అకాడమీకి వెళ్లేదారి, బాకారం, నాగిరెడ్డిగూడ వెళ్లే రహదారుల గుండా ఉన్న చెత్త, వ్యర్థాలు, మందు బాటిల్స్‌ను తొలగింపజేశారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు రోడ్డుకు ఇరువైపుల చెత్త వేయొద్దన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. చెత్త వేసే వారు తమ ఇళ్ల వద్దకు వచ్చే చెత్త బండిలో వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులు



స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

శంకర్‌పల్లి: ప్రతీ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఎనిమిదోతరగతి విద్యార్థులకు నిర్వహించే ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలో శంకర్‌పల్లి మండలం కొండకల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఆ పాఠశాలలో మొత్తం 15మంది విద్యార్థులు పరీక్ష రాయగా 6మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకూ సంవత్సరానికి రూ. 12వేల చొప్పున అందించనుంది. ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించి, ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల సాధ్యమయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘునందన్‌రెడ్డి, అంజిరెడ్డి, సుజాత, కుసుమకుమారి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టండి

మాజీ వైస్ ఎంపీపీ నర్సింహయాదవ్



మండల వ్యవసాయ అధికారి శిరీషకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట: నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని మాజీ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు పసుల నర్సింహయాదవ్ పేర్కొన్నారు. మండలంలో నకిలీ విత్తనాల విక్రయాలపై బీజేపీ నాయకులు శుక్రవారం మండల వ్యవసాయ అధికారి శిరీషకు వినతి పత్రం అందజేశారు. అనంతరం నర్సింహ్మయాదవ్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు లభించకపోతే తీవ్రంగా నష్టపోతారన్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి నాసిరకం విత్తనాల విక్రయాలను అరికట్టాలన్నారు. కొరెడ్ల నరేందర్‌రెడ్డి, మహేష్, తిరుపతి, కుమారస్వామి, గోపాల్‌రెడ్డి, పారేష, ప్రతాప్‌రెడ్డి, చందు, పాండు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో బడులు!

- పిల్లలు వెళ్తున్నా..ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు
- ఖాళీగా తరగతి గదులు
- చెత్తా, చెదారంతో పేరుకుపోతున్న పరిసరాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఇర్రుకుంట తండాలో చెత్తా, చెదారంతో నిండిన పాఠశాల

శంకర్‌పల్లి: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెడుతున్నా అవి క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. శంకర్‌పల్లి మండలంలోని పలు పాఠశాలల్లో చదువుకోడానికి పిల్లలు బడికి వెళ్తున్నా అక్కడ చదువులు చెప్పే ఉపాధ్యాయులు ఉండడం లేదు. పాఠశాలలు ప్రారంభమై మూడు రోజులు గడిచినా కొన్ని పాఠశాలల్లో నేటికి ఉపాధ్యాయులు రావడం లేదు. మరికొన్ని పాఠశాలల్లో వచ్చిన గంటకు మించి ఉండట్లేరు. మండలంలో కొంత మంది ఉపాధ్యాయులకు ఉన్నతాధికారులు అనుకూలంగా ఉండడంతోనే ఇలా జరుగుతుందని కొందరు చెబుతున్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లకపోయినా చూసిచూడనట్లు వ్యవహరించడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం చేసి..

శంకర్‌పల్లి మండలం, హుస్సేన్‌పూర్‌లో మండల ప్రభుత్వ పాఠశాల ఉంది. ఇక్కడ 15నుంచి 20మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది ఈ పాఠశాలకు మాసానిగూడలో పని చేస్తున్న నర్సింలు అనే ఉపాధ్యాయున్ని డిప్యూటేషన్‌పై పంపించారు. ఈ సంవత్సరం ఎవరిని పంపకపోవడంతో విద్యార్థులు పాఠశాలకి వచ్చి మధ్యాహ్న భోజనం చేసి ఇంటికి వెళ్తున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి విద్యార్థులకు బోధన అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులు రాకపోవడంతో..

పాఠశాలలు ప్రారంభమై మూడు రోజులు గడిచాయి. మండలంలోని ఇర్రుకుంట తండాలో శుక్రవారం పాఠశాల ప్రారంభమైంది. సంకేపల్లి పాఠశాల నుంచి నాగయ్య, చేవెళ్ల మండలం పల్గుట్ట నుంచి వెంకట్‌రాంరెడ్డి అనే ఇద్దరూ ఉపాధ్యాయులను గురువారం డిప్యూటేషన్‌పై పంపించారు. వారు శుక్రవారం వచ్చి పాఠశాలను తెరచి శుభ్రం చేయిస్తున్నారు. పాఠశాల లోపల అంతా చెత్తా, చెదారం, మద్యం సీసాలతో నిండి ఉంది. మూడు రోజులుగా పాఠశాలకు వస్తున్న విద్యార్థులు ఉపాధ్యాయులు రాకపోవడంతో వెనుతిరిగి పోతున్నారు.

ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి

జన్వాడ మండల ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 135మంది విద్యార్థులకు గాను ప్రధానోపాధ్యాయునితో కలిపి ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో బోధన, మౌలిక వసతులు చూసుకోవాల్సిన ప్రధానోపాధ్యాయుడు పి జాన్ ఉదయం కొన్ని గంటల పాటు పాఠశాలకి వచ్చి కాసేపు ఉండి వెళ్లిపోతున్నారు. 2015లో వచ్చినప్పటి నుంచి ఇదే తంతుగా వ్యవహరిస్తున్నారు. దీనిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేసేందుకు గాను అనేక పథకాలను తీసుకొస్తుంది. వాటిని కింది స్థాయిలో అమలు చేసే సిబ్బంది సక్రమంగా లేకపోవడంతో పేద విద్యార్థులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు సమస్యలపై స్పందించి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



హుస్సేన్‌పూర్ పాఠశాలలో ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఖాళీగా కుర్చున్న విద్యార్థులు



హుస్సేన్‌పూర్ పాఠశాల భవనం

ఎట్టకేలకు హెచ్‌ఎం పోస్టుల భర్తీ

విధుల్లో చేరిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు

కొందుర్గు: కొంత కాలంగా కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను ఎట్టకేలకు భర్తీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా గద్వాల నుంచి గోపినాథ్ కొందుర్గు ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎంగా విధుల్లో చేరారు. అదేవిధంగా జానంపేట నుంచి గాయత్రీదేవి ముట్పూర్ జీహెచ్‌ఎంగా బాధ్యతలు తీసుకున్నారు. మైలార్ దేవునిపల్లి నుంచి ఉదయ్‌కుమార్ ఇంద్రానగర్‌కు, ఆకుతోటపల్లి నుంచి సునీత చౌదరిగూడకు, తొండుపల్లి నుంచి కిరణ్ కుమార్ ఎదిర, ఆమన్‌గల్ నుంచి వెంకట్ రెడ్డి పెద్దఎల్కిచర్లకు జీహెచ్‌ఎంలుగా శుక్రవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో జీహెచ్‌ఎంలకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.



వెంకట్ రెడ్డిని సన్మానిస్తున్న పెద్దఎల్కిచర్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు

అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడితే ఊరుకోం

ఏబీవీపీ కార్యదర్శి మహిపాల్



ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న మహిపాల్ తదితరులు

చేవెళ్ల: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో విద్యార్థులను, తల్లిదండ్రులను అధిక ఫీజులకోసం వేధిస్తే ఊరుకోమని ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు. అక్రమంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. జీఓ 1 ప్రకారం లాభాపేక్ష లేకుండా విద్యాసంస్థలు పనిచేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ అవి పాటించడం లేదన్నారు. ధనార్జనే ధ్యేయంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. జీఓ 91 ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు టెక్నో, ఈ టెక్నో, డీజీ, టాలెంట్, ఒలింపియాడ్ బ్రాండ్ల పేరుతో విద్యాసంస్థలు నడపరాదని చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. రాఘవేందర్, ప్రశాంత్, ఉదయ్, శివ, పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యం

కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్‌భరత్

మొయినాబాద్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చేవెళ్ల కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి ఎంచుకున్నప్పుడు ఆర్థికంగా నిలదొక్కుకుంటేనే భవిష్యత్ బాగుంటుందన్నారు. ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధిలో నాణ్యమైన సేవ చేస్తేనే వినియోగదారులు అలవాటు పడతారని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగ యువత కోసం స్వయం ఉపాధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ కేఫ్ ఎయిర్ సంస్థ లక్ష్మీబాయి, ఉర్మిలదేవి, చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సౌందర్యరాజన్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ జెడ్పీటీసీ కంజర్ల భాస్కర్, షాబాద్ రాజు, సంజీవరెడ్డి, రాజయ్య, మర్రి రవీందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మక్బుల్, రమేష్, టిల్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భీమ్‌భరత్

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల
- చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



చేవెళ్ల: తంగడపల్లి ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కేశంపేట: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న విశాల

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటంతోపాటు విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నభోజనం అందిస్తూ ప్రోత్సహిస్తుందని తంగడపల్లి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్. గోపాల్, వెంకటేశ్‌లు పేర్కొన్నారు. తంగడపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలకు క్రమం తప్పకుండా వచ్చి బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్,పాల్గొన్నారు.

కేశంపేట: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య బోధన చేస్తున్నారని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి పేర్కొన్నారు. ‘మనఊరు మనబడి’ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని చెప్పారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల్ని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి విద్యాధికారి మనోహర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ నర్సింలు, పాల్గొన్నారు.

షాబాద్: సర్కార్ బడుల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మండల నోడల్ అధికారి లక్ష్మణ్ పేర్కొన్నారు. సీతారాంపూర్ ప్రాథమిక పాఠశాలలో బడిబాటలో భాగంగా విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కార్ బడులకే పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయశ్రీ, ఉపాధ్యాయులు శ్రీశైలం, అంగన్‌వాడీ టీచర్ మీనా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: చంద్రాయాన్ గూడ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు పాఠశాల హెచ్‌ఎం శివ లింగమ్మ అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వపాఠశాలలో నాణ్యమైన విద్యనందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పద్మ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా జీతాల్లేవు!

ఎంపీడీఓకు హిమాయత్‌నగర్ పంచాయతీ సిబ్బంది ఫిర్యాదు



సంధ్యకు వినతిప్రతం ఇస్తున్న పంచాయతీ సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందికి మూడు నెలలుగా జీతాల్లేవని, తాము ఎన్నో ఇబ్బందులు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల అభివృద్ధి అధికారి సంధ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని తెలిపారు. జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభమైనందునా స్కూల్ ఫీజులు, రేషన్, సరుకులు తీసుకోవడానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆమె గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణితో మాట్లాడారు. అటెండెన్స్ పంపించినట్లు సంధ్యారాణి ఎంపీడీఓతో చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, ప్రమీళ, అరుణ, చంద్రయ్య, అనిత తదితరులు పాల్గొన్నారు.

చదువే అన్నింటికీ మూలం

- భవిష్యత్‌కు బంగారు బాట
- న్యాయవాది నరేంద్రనాథ్



చెర్కుపల్లి పాఠశాలలో విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు

కొందుర్గు: ప్రతి విద్యార్థి బాగా చదివి, భవిష్యత్‌ను బంగారు బాటగా మలుచుకోవాలని న్యాయవాది నరేంద్రనాథ్ పేర్కొన్నారు. చదువే అన్నింటికీ మూలం అని గురుకుల విద్యార్థులను సన్మానించిన సందర్భంగా ఆయన అన్నారు. కొందుర్గు మండలం చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం శివారెడ్డి శుక్రవారం గురుకుల సీట్లు సాధించిన 21 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరేంద్రనాథ్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెరుకుపల్లి పాఠశాలలో 6 సంవత్సరాల్లో 95 మంది విద్యార్థులు గురుకుల సీట్లు సాధించడం పాఠశాలలో బోధన చేస్తున్న ఉపాధ్యాయుల పనితీరుకు ఇది నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణవేణి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ లావణ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్

షాద్‌నగర్‌రూరల్: ఆపద సమయంలో చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తం అందకపోవడంతో ఎంతోమంది ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. అలాంటి వారికి రక్తం దానంచేసి ప్రాణాలు కాపాడొచ్చన్నారు.

రక్తదానం చేయడంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. ప్రతిమూడు నెలలకోసారి ప్రతిఒక్కరూ రక్తం దానం చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబర్‌అలీఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, రఘు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా డీఎల్‌ఓ డాక్టర్ అరుణ, ఇమ్యూనైజేషన్ అధికారిణి స్వర్ణకుమారి, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, బ్లడ్ బ్యాంక్ ఇంచార్జి శ్రీహరి, వైద్యసిబ్బంది ఉదయ్, అన్వర్, లాబ్ టెక్నీషియన్ అరుణ్, సంపత్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శంకర్‌పల్లిలో బీజేపీ విజయోత్సవ ర్యాలీ

శంకర్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో బీజేపీ గెలవడంతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం శంకర్‌పల్లిలో బైక్ ర్యాలీకి ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. పట్టణ శివారులోని చెందిప్ప నుంచి శంకర్‌పల్లి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు.

ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి



సిబ్బందికి సరుకులు అందిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి

శంకర్‌పల్లి: పారిశుద్ధ్య సిబ్బంది రోజు వారి పనులతో పాటు, తమ ఆరోగ్యాలను జాగ్రత్తగా కాపాడుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశంతో పాటు పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు, నిత్యవసర వస్తువులను కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ఆమె పంపిణీ చేశారు. కౌన్సిల్ సమావేశంలో 2024–25 సంవత్సరంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అజెండాను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



ఎంపీడీఓ కార్యాలయలంలో మాట్లాడుతున్న డాక్టర్ దామోదర్

షాద్‌నగర్‌రూరల్: నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని శుక్రవారం పట్టణంలోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సంవత్సరం వయసు నుంచి 19 సంవత్సరాల వయస్సు వరకూ ప్రతిఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ శ్రీహరి పాల్గొన్నారు.

షాబాద్: చిన్నారులకు నులి పురుగు మాత్రలు వేయించాలని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీఓ అపర్ణ, వైద్య సిబ్బంది, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగు మాత్రలు వేసుకుంటే పిల్లల్లో రక్తహీనత తగ్గి, రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఎదుగుతారని తెలిపారు. 12 నెలల నుంచి 23 నెలలోపు పిల్లలకు సగం మాత్ర, భోజనం తర్వాత వేయాలన్నారు. 23 నెలల నుంచి ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు పూర్తి మాత్ర వేసి నీళ్లు తాపించాలని సూచించారు. 6 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వారికి పూర్తి మాత్ర నమిలి మింగించాలని భోజనం చేసిన గంట తర్వాత ఈ మాత్రలు వేయించాలన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి నులిపురుగు దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, కళాశాలల్లో మాత్రల పంపిణీ ఉంటుందని తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564